### పార్టీలెన్ని వచ్చినా..

# తెదేపాకు ఢోకా లేదు

**అవకాశవాదుల పోకతో మరింత పటిష్ఠం ❑ శాసనమండలి రద్దుచేయం**
**సంక్షోభాలెలా దాటాలో నాకు తెలుసు ❑ మళ్లీ కర్షక పరిషత్**
**విజయం తథ్యం: చంద్రబాబు ❑ రంగారెడ్డి, పాలమూరు జిల్లాల్లో 'మీకోసం'**



తుక్కుగూడాలో నిర్వహించిన 'మీ కోసం'లో ముస్లింలు బహుకరించిన టోపీ, శాలువాతో చంద్రబాబు

రంగారెడ్డిజిల్లా, మహబూబ్‌నగర్ - న్యూస్‌టుడే

**వ**చ్చే ఎన్నికల్లో తెదేపా విజయం నూటికి నూరు శాతం తథ్యం. కాంగ్రెస్ చిత్తుచిత్తవ్వక తప్పదు. ఇటీవల వ్యక్తికో పార్టీ చొప్పున వెలుస్తున్నాయి. ఇలాంటి పార్టీలెన్ని వచ్చినా ప్రజలు ఆదరించరు. తెదేపా శక్తి ముందు ఇవన్నీ బలాదూర్.

**- చంద్రబాబు**

కాంగ్రెస్ ప్రభుత్వ ఆయుష్షు ఇంకా ఆరునెలల మాత్రమేనని, తర్వాత తెదేపా అధికారంలోకి వస్తుందని, ప్రజల కష్టాలన్నీ తీరతాయని ఆ పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. క్షేత్ర స్థాయిలో పటిష్ఠమైన యంత్రాంగమున్న పార్టీ దేశంలో తెదేపా ఒక్కటేనని చెప్పారు. మీకోసం యాత్రలో భాగంగా ఆయన ఆదివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో పర్యటించారు. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రవేశించారు. దేవేందర్‌గౌడ్ సొంత గ్రామం తుక్కుగూడలో బాబు యాత్రకు అపూర్వ స్పందన లభించింది. వేలసంఖ్యలో తరలివచ్చిన జిల్లా నాయకులు, ముఖ్య కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు. అనంతరం పాలమూరు జిల్లా కడ్తాలలో కూడా మాట్లాడారు. ఆయా సందర్భాల్లో ఏమన్నారంటే..

ఆకులు రాలినంత మాత్రాన చెట్టుకేమీ కాదు. మళ్లీ కొత్తగా చిగురించి పటిష్ఠమవుతుంది. ఇటీవల వ్యక్తికో పార్టీ చొప్పున వెలుస్తున్నాయి. కొద్దిరోజుల్లో మరో పార్టీ రాబోతోందట. మనం భయపడాల్సిన పని లేదు. ఎన్ని పార్టీలు వచ్చినా తెదేపాకు ఢోకాలేదు. ప్రజల అండతో వచ్చే ఎన్నికల్లో నూటికి నూరుశాతం విజయం సాధిస్తాం. నిన్న ఈ మాట చెబితే నా దగ్గర మంత్రదండముందని, మంత్రాలు వేస్తానన్నట్లు పత్రికలు రాశాయి. నా దగ్గర పక్కా వ్యూహం ఉంది. మంత్రతంత్రాలపై నాకు నమ్మకం లేదు. తెలంగాణ విషయంలో కాంగ్రెస్ ఊసరవెల్లి వైఖరిని ప్రజలకు చెప్పండి. పార్టీ కోర్ కమిటీ భేటీ త్వరలోనే నిర్వహిస్తాం. అన్ని ప్రాంతాలకు ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకుంటాం. జాతీయ స్థాయిలో ఏర్పాటయ్యే మహాకూటమి రాష్ట్రంలోనూ ఉంటుంది. ఆయా పార్టీలతో పొత్తులు పెట్టుకుంటాం.

**జెండా మోస్తున్నది కార్యకర్తలు:** కొంతమంది అధికారంలో ఉన్నప్పుడు పదవులన్నీ అనుభవించి అవకాశవాదంతో ఇపుడు బయటకు వెళ్లిపోయారు. ఒకరిద్దరు ఎంపీలు కాంగ్రెస్‌కు అమ్ముడుపోయారు. నాయకులు వెళ్లిపోయినా కార్యకర్తలు సంఘీభావంగా నిలిచారు. వారి రుణం ఎలా తీర్చుకోను? కొందరు నాయకులు ప్రజాస్వామ్యాన్ని గౌరవించరు. వారు చెప్పింది చేస్తేనే పార్టీలో ప్రజాస్వామ్యమున్నట్లు, లేకుంటే స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లేనట్లు విమర్శిస్తారు. పైసా ఖర్చు లేకుండా రెండు సార్లు ఎంపీ పదవి ఇచ్చిన వ్యక్తి వెళ్లిపోయాడు. మరో నాయకుడి కుటుంబానికి పార్టీ పదవులు, ఎమ్మెల్యే, ఎంపీ పదవులు ఇచ్చినా వెళ్లిపోయాడు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడల్లా మంత్రి పదవులు పొందిన మరొకాయనకు ఇపుడు పార్టీ చేదుగా మారిపోయింది. భుజాలు అరిగిపోయేలా జెండా మోస్తున్నది కార్యకర్తలు. వారిపై స్వారీ చేస్తున్నది కొందరు అవకాశవాద నాయకులు. 1984లో ఇలాగే 34 మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోయారు. 1985లో భారీ మెజారిటీ వచ్చింది. 1989 ఎన్నికల తర్వాత ఇలాగే కొందరు వెళ్లారు. 1994లో అంతకన్నా ఎక్కువ మెజారిటీ లభించింది. 1996లోనూ కొందరు ఎంపీలు నాయకులు వెళ్లారు. అయినా 1999లో పార్టీ గెలిచింది. సంక్షోభాలు పార్టీకి కొత్తకాదు. దాన్ని తట్టుకునే సర్వశక్తులు నాకున్నాయి. ఎన్నికలు మరో తొమ్మిది నెలలే ఉన్నాయి. మీ సత్తా ఏమిటో చూపించాలి. పార్టీ గెలిస్తేనే మనందరం బాగుంటాం. పార్టీ భవిష్యత్తే మనందరి భవిష్యత్తు. పార్టీని గెలిపించండి. తర్వాత మిమ్మల్ని ఎలా చూసుకోవాలో నాకు వదిలిపెట్టండి. బీసీలకు పెద్దపీట వేస్తాం. 100 సీట్లు ఇస్తామని ఇదివరకే ప్రకటించాం. అధికారంలోకి వచ్చాక శాసనమండలిని కొనసాగిస్తాం. రద్దుచేయం. కర్షక పరిషత్‌ను తిరిగి ఏర్పాటు చేస్తాం. ఇప్పటి రుణ మాఫీ అంతా బోగస్. నీతి నిజాయితీగా రుణాలు చెల్లించిన రైతులకు రూ.5 వేలు బిక్షం వేయడం కాదు.. వారికీ పూర్తిగా రుణాలు రద్దు చేయాలి. మేం అధికారంలోకి వచ్చాక పూర్తిగా మాఫీ చేస్తాం. బెల్టుషాపులను రద్దు చేసి మద్య నియంత్రణ తీసుకొస్తాం.

వర్షాలు పడకున్నా తొమ్మిదేళ్లలో ఒక్కసారీ కరెంటు కోతలేకుండా చూశాను. ఇపుడు రెండు నెలలు వర్షం లేకుంటే .. చేతగాని ముఖ్యమంత్రి కరెంటు ఇవ్వలేమని చేతులెత్తేశారు. అన్యాయాలు అక్రమాలపై గొంతెత్తి నినదిస్తున్నా ఈ రాక్షస ప్రభుత్వానికి వినిపించడం లేదు. ఓటేసినందుకు ప్రజలు కొంతకాలం ఈ బాధలు భరించక తప్పదు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించండి. తెదేపా అధికారంలోకి వచ్చి మీ బాధలన్నీ తీరుస్తుంది.